ప్రజాశక్తి
శనివారం 4 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



ఉపాధ్యాయుడిని నియమించాలి


మాట్లాడుతున్న శంకర్రావు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు:మండలంలో వనుగుమ్మ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు డిమాండ్ చేశారు. పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ, ఈ పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరి ఉపాధ్యాయులతో నడుస్తుందని, ఈ పరిస్థితిలో ఈ మధ్యకాలంలో ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై కిలగడ ఆశ్రమ పాఠశాలకు పంపించారన్నారు. దీంతో విద్యార్థులకు సక్రమంగా విద్యా బోధన అందటం లేదని తెలిపారు.ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడిని నియమించి మెరుగైన విద్యాభ్యాసం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కె.విక్రమ్, శాంతన్న, సద్దునా, ఎస్.రాజు పాల్గొన్నారు.

హైడ్రో ప్రాజెక్టుపై గిరిజనాగ్రహం

- తమ జీవనాధార భూములను లాక్కోవొద్దని పెద్ద పెట్టున నినాదం
- ఎర్రవరంలో భారీ బహిరంగ సభ, ర్యాలీ
- పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు, ప్రజా ప్రతినిధులు


అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ మధు, అప్పలనర్స, తదితరులు

ప్రజాశక్తి - పాడేరు:గిరిజన చట్టాలను ఉల్లంఘించి హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఏజెన్సీలో ప్రయివేటు సంస్థలకు కట్టబెడుతూ ప్రభుత్వం ప్రతిపాదించడాన్ని వ్యతిరేకిస్తూ చింతపల్లి మండలం ఎర్రవరంలో శుక్రవారం ఎపి గిరిజన సంఘం నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివచ్చారు. హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. 'మా అడవి జోలికి రావొద్దు. మా జీవనాధార భూములను అమ్మొద్దు, 1/70 చట్టాన్ని పరిరక్షించాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అఖిలపక్ష పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు సంఘటితంగా కదిలి వచ్చి హైడ్రో ప్రాజెక్టు ప్రతిపాదనను వ్యతిరేకించారు. గిరిజనులు తీవ్ర ఆగ్రహ నినాదాలతో ఎర్రవరం మార్మోగింది. నెల రోజులుగా హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజన సంఘం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలపై స్థానికంగా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. గిరిజనులు ఆసక్తిగా తిలకించారు.


భారీ ర్యాలీ చేపడుతున్న గిరిజనులు

ర్యాలీ అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథి, రాజ్యసభ మాజీ సభ్యులు, ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు పి.మధు మాట్లాడారు. అల్లూరి జిల్లాలో గిరిజనులకు తీవ్ర నష్టం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టుల ప్రతిపాదనలను విరమించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స మాట్లాడుతూ
ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ప్రతిపాదనపై గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నందున ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు కల్ల బొల్లి మాటలు మాట్లాడుతున్నారన్నారు. హైడ్రో ప్రాజెక్టు ప్రతిపాదనను ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ ప్రాజెక్టు జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లిపోయిందని పాడేరు ఎమ్మెల్యే అంటున్నారని, వైసీపీ కార్యకర్తలు చెబుతున్నారని ఇలా బూటకపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నిజంగా ప్రభుత్వం రద్దు చేస్తే పత్రికా ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం ఆదివాసీల పట్ల కుట్ర మోసం చేస్తున్నారని, ఇంకా ఈ ప్రాంతంలో గిరిజనులని చెట్టుకొకరిని పుట్టకొకరిని తోలేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. యర్రవరంలో ఉన్న గిరిజనులు 300 నుండి 500 ఉన్నారని, ఈ ప్రాంత వాసులకు అన్యాయం జరిగితే గిరిజన సంఘం ఊరుకోదని పునరుద్ఘాటించారు.జిల్లాలో ఉన్న ఆరున్నర లక్షల మంది గిరిజను లను సంఘటితం చేస్తామన్నారు.


పెద్ద పెట్టున నినాదాలు చేస్తున్న గిరిజనులు

ఏపీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ.. హైడ్రో పవర్ ప్రాజెక్టులపై చింతపల్లి ప్రాంతంలో బాధిత గ్రామాల గిరిజనులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఎంపీ, ఎమ్మెల్యేలు ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ఎక్కడ ఏ ప్రాజెక్టులు నిర్మించినా గిరిజనులు నిర్వాసితులైపోతున్నారని, గిరిజన చట్టాలు, హక్కులు కాల రాస్తున్నారని ధ్వజమెత్తారు. హైడ్రోతో ముప్పు వాటిల్లకుండా గిరిజన సంఘం ముందు చూపుతో పార్టీలకు అతీతంగా ఉద్యమానికి గిరిజనులను సిద్ధం చేస్తోందన్నారు.

గొందిపాకలు సర్పంచ్ వరలక్ష్మి మాట్లాడుతూ.. తాత తండ్రుల కాలం నుంచి ఇక్కడ బతుకుతున్నామని, తమ జీవనాధారం దెబ్బతీస్తే ఊరుకునేది లేదని తెలిపారు.

వైసిపి నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఉల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం మోడీ చెబితే ఆదానికి ఈ భూముల్ని కట్టబెడతారా? అందుకేనా అత్యధిక మెజారిటీ ఇచ్చి ప్రజలు గెలిపించిందని అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైడ్రో ప్రాజెక్ట్‌తో సారవంతమైన భూములను కోల్పోతామన్నారు.

ఈ సభలో ఎర్ర బొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు చెక్కే సత్తిబాబు, సిపిఐ నాయకులు సూరిబాబు ప్రసంగించారు. గూడెపు కృష్ణంరాజు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, చింతపల్లి, కొయ్యూరు మండలాలకు చెందిన పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

ఎర్రవరం జలపాతాన్ని అభివృద్ధి చేయాలి

- రాజ్యసభ మాజీ సభ్యులు మధు

ఈ ప్రాంతానికి ఉభయ రాష్ట్రాల నుంచి వస్తున్న పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని చింతపల్లి మండలంలోని ఎర్రవరం జలపాతాన్ని అభివృద్ధి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు పీ.మధు ఐటీడీఏ అధికారులకు సూచించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా శుక్రవారం ఎర్రవరంలో జరిగిన బహిరంగ సభకు ఆయన హాజరయ్యారు. ఎర్రవరం జలపాతాన్ని ఆయన ఈ సందర్భంగా సందర్శించారు. పర్యాటకుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని ఈ జలపాతం సమీప గ్రామాల గిరిజనులందరినీ సంఘటిత పరిచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే రీతిలో దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. జలపాతం సందర్శనకు వీలుగా మెట్లు నిర్మించి, మరిన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ జలపాతం వద్దకు సగం వరకే ఉన్న తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆయన సూచించారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై నిరసన

ప్రజాశక్తి-ఎటపాక

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని గుండాల కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ కేంద్ర బి.జె.పి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో పోలవరం నిర్వాసితులకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఆహార సబ్సిడీలోనూ, రైతుల సబ్సిడీలోనూ, మధ్యాహ్న భోజన పథకంలోనూ, పేదలకు ఉపశమనం కలిగించే అన్ని రకాల పథకాల్లోనూ బిజెపి ప్రభుత్వం కోతలు విధించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు డి.మాధవరావు, ఐ.పద్మ, పార్టీ నాయకులు తోట శ్రీను, సుధాకర్, ప్రవీణ్, కె.వెంకట్ సాయి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలతో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

పాఠశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- విద్యాలయాలను సందర్శించిన ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి -విఆర్.పురం

పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఎంపీపీ, సిపిఎం నాయకులు సందర్శించారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ లేరని హెచ్ఎం వెంకట్రావు ఎంపీపీ కారం లక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లడుతూ మాట్లాడుతూ టెన్త్ వార్షిక పరీక్షలు దగ్గర్లో ఉన్నాయని, పిల్లల మంచిగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని వడ్డీ గూడెం స్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, గూటాల శ్రీనివాసరావు, తుర్రం బాబూరావు పాల్గొన్నారు.


గంజాయి తోటలను నరికి వేస్తున్న పోలీసులు

రూ.50 లక్షల విలువైన గంజాయి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో రూ.50 లక్షల విలువైన గంజాయి తోటలను ఒడిశా పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఒడిశా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మల్కనగిరి జిల్లా కళిమేల బ్లాక్ చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి కప్ప తొట్టి పంచాయతీ పరిధి అరిగెల, సత్‌పుట్టు గ్రామ అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులు సమాచారం అందింది. దీంతో మల్కనగిరి ఎస్పి ఆదేశాల మేరకు చిత్రకొండ సిఐ ముకుంద మిల్కా ఆధ్వర్యంలో శుక్రవారం గంజాయి ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 30 ఎకరాల్లో గంజాయి తోటలో ధ్వంసం చేశారు. ఇప్పటికైనా గంజాయి సాగు విడనాడకపోతే కఠిన చర్యలు తప్పవని గిరిజనులను హెచ్చరించారు. డ్రోన్ కెమెరాలతో గంజాయి తోటలను గుర్తించి ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈనెల 15 వరకు గంజాయి ఆపరేషన్ కొనసాగుతుందని ఒడిశా పోలీసులు వెల్లడించారు.

జాతీయ రహదారి పనులను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - రంపచోడవరం


రహదారి పనులను పరిశీలిస్తున్న ఎంపిపి

మండలంలోని ఐ.పోలవరం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి 516ఎ నిర్మాణ పనులను ఎంపిపి బందం శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి వల్ల నీటి ముంపునకు గురవుతున్న పంటపొలాలకు సాగునీరు అందించేందుకు నేషనల్ హైవే అంచనాలలో కల్వర్టు లేనప్పటికీ ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి కల్వర్టు మంజూరు చేయించినట్లు చెప్పారు.


వినతిపత్రాన్ని ఇస్తున్న సిఐటియు నేత సన్నిబాబు, అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి -పెదబయలు:అంగన్‌వాడీలకు రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు అధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం. నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బోండా సన్నిబాబు మాట్లాడుతూ, మండలంలో 193 అంగన్‌వాడీ కేంద్రాలలో. పని చేస్తున్న టీచ లకు, మినీ అంగన్వాడీ ఆయాలకు గత రెండు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనిభారం పెంచుతూ.. అరకొర జీతాలు కుడా సకాలంలో చెల్లించక పోవడం దారుణమన్నారు. కనీస వేతనాలు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి అధికారుల వేదింపులు ఆపాలన్నారు. ఈనెల 6న పాడేరు కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.సరబాన్న, నాయకురాలు రాజమ్మ, శాంతి, కళావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- టిడిపి ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- అరకులోయరూరల్:వచ్చే 2024 ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు. సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అక్షయ్ ఇన్‌లాడ్జిలో టీడీపీ అరకు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అవంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని కార్యకర్తలను సూచించారు. భాధుడే బాదుడు, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలన పై ప్రజల వద్దకు వెళ్ళి వివరించాలని చెప్పారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా అందరూ కలిసి కట్టుగా సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్టి సెల్ అధ్యక్షుడు సివేరి దొన్ను దొర, మాజీ మంత్రి అరకు నియోజకవర్గ ఇన్చార్జి కిడారి శ్రావణ్ కుమార్, టీడీపీ అరకులోయ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, టీడీపీ మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యుడు సివెరి అబ్రహం, మహిళా నాయకురాలు బుర్జ బారికి లక్ష్మీ పాల్గొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన లారీ

- విహార యాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు దుర్మరణం

- డ్రైవర్‌తో సహా ఐదుగురికి గాయాలు


నారాయణరెడ్డి మృతదేహం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామ సమీపంలో మలుపు వద్ద పన్నెండు టైర్ల భారీ లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విహార యాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు యువకులకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, మృతుల స్నేహితుల తెలిపిన వివరాలు ప్రకారం...

ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు గురువారం పాపికొండలు విహార యాత్రకు వెళ్లారు. అనంతరం బస్సులో మారేడుమిల్లికి వచ్చారు. రాత్రి మారేడుమిల్లి క్యాపింగ్ టెంట్ రిసార్ట్‌లో స్టే చేశారు. అనంతరం శుక్రవారం బస్సుతో జలతరంగిణి జలపాతానికి చేరుకుని, జలపాతాన్ని సందర్శించి అక్కడ నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. అక్కడ నుంచి మారేడుమిల్లి తిరిగి రావడానికి వేచి చూస్తున్నారు. ఈ సమయంలో పౌరసరఫరాల బియ్యాన్ని చింతూరులో దింపి తిరిగి రాజమహేంద్రవరం వస్తున్న 12 టైర్ల భారీ లారీ ఆ మార్గంలో వస్తుండగా, దానిని ఆపి ఆరుగురు యువకులు ఎక్కారు. పాములేరు గ్రామ సమీపం వద్ద మలుపులో ఈ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్లను ఢీకొని సుమారు 80 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో విహార యాత్రకు వచ్చిన పి.నారాయణ రెడ్డి (32), జి.సురేష్ (23) అక్కడికక్కడే మృతి చెందారు. నాగిరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, పెద్దమాతా సుబ్బారెడ్డి, స్వామి, లారీ డ్రైవర్ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మారేడుమిల్లి సీఐ శ్రీనివాసరావు, మారేడుమిల్లి, గుర్తేడు ఎస్సైలు రాము, జ్వాల సాగర్ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని స్థానిక ప్రజల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. నాగ సురేష్ మృత దేహం లారీ ఎదుట భాగం కింద మట్టిలో కూరుకుపోయింది. లోయలో పడిపోవడంతో వెలికితీత చర్యలు చేపట్టారు. మృతులు పిచ్చెల నారాయణ రెడ్డి ఒడిశా రాష్ట్రం రామ్‌ంగపూర్లో రైల్వే స్టేషన్లో టీసీగా పనిచేస్తున్నారు. నాగ సురేష్ ఎంసీఏ చదువుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మారేకుమిల్లి పోలీసులు తెలిపారు.

మరమ్మతులకు నోచని చేతిపంపులు

తాగునీటికి ఇబ్బంది పడుతున్న గొమ్ముఅయ్యవారి గూడెం ప్రజలు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని గొమ్ముఅయ్యవారిగూడెం గ్రామంలో రెండు చేతి పంపులు నెలల తరబడి పనిచేయకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో మూడు, పాఠశాలలో ఒకటి మొత్తం నాలుగు చేతి పంపులు ఉన్నాయి. ఈ గ్రామస్తులకు నీటి ఆధారం ఇవే. గ్రామంలో ఉన్న ఒక బోరు ఆరు నెలల క్రితం, పాఠశాలలో బోరు నాలుగు నెలల క్రితం పాడైపోయాయి. వీటిని మరమ్మతులు చేయాలని నాటి నుండి పంచాయతీ కార్యదర్శికి, వాలంటీర్లకు గ్రామస్తులు విన్నవిస్తూనే ఉన్నారు. అయినా వాటి మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం మిగిలిన రెండు బోర్లపై ఆధారపడుతున్నారు. బోరు పాడైపోయిన ప్రాంత ప్రజలు దూరంగా ఉన్న బోర్ల నుండి నీళ్లు తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. వేసవి వచ్చిందంటే భూగర్భ జలాలు అడుగంటిపోయి పని చేస్తున్న రెండు బోర్ల నీరు ఎటూ చాలని పరిస్థితి ఏర్పడనుంది. మరో వైపు పాఠశాలలో బోరు పాడైపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం ఆరు బయట ఉన్న పంపుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమయంలో వాహనాలు తిరుగుతున్నాయని, పిల్లలను బయటకు పంపడం అంత శ్రేయస్కరం కాదని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు తెలియజేస్తున్నారు. వేసవి కాలం వచ్చిందంటే తాగునీటి సమస్య మరింత తీవ్రం కానుంది. బోర్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్ని సార్లు తెలియజేసినా ప్రయోజనం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయితీ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు రెండు బోర్లకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గొమ్ము అయ్యవారి గూడెంలో పాడైపోయి నిరుపయోగంగా ఉన్న బోరుబావి

కొత్తగా ఆరు ఇంటర్ పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు రెవెన్యూ డివిజన్ కు కొత్తగా ఆరు ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు మంజూరయ్యాయి. పరీక్షా కేంద్రాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏజెన్సీలో ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో గిరిజన విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఐటిడిఎ పిఒ పలుమార్లు సెక్రటరీ (ఇంటర్మీడియట్) దృష్టికి తీసుకుని వెళ్లారు.దీనిపై స్పందించిన ప్రభుత్వం కొత్తగా ఆరు పరీక్షా కేంద్రాలు మంజూరు చేసింది. సీలేరు, జికె వీధి, కొయ్యూరు, చింతపల్లి, ముంచింగిపుట్టు, అనంతగిరి మండలాల్లో కొత్తగా ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలు మంజూరయ్యాయి. దీంతో, ఆయా చోట్ల పరీక్ష కేంద్రాలకు వెళ్లి పరీక్షకు హాజరయ్యే ఇంటర్ విద్యార్థులకు కష్టాలు తీరనున్నాయి.

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు పింఛన్లు



పింఛను అందజేస్తున్న ఎంపిపి సీతమ్మ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో దారేల పంచాయతీ దారేలా, చీపుక చింత గ్రామాల్లో సికెల్‌సెల్ ఎనిమియా (రక్తహీనత)తో బాధపడుతున్న చెండా మొఖ్యాగ్ని, చవితియా భాగ్యలతలకు రూ.10వేల పింఛన్లను ఎంపీపీ అరిసెల సీతమ్మ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన డబ్బులను వృధాగా ఖర్చు చేయకుండా పౌష్టికాహారాల కొనుగోలు, ఆరోగ్యంకు ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున, ఒకటో వార్డు మెంబర్ పాంగి మన్మథరావు, ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, దారెలమాజీ సర్పంచ్ మండి పెంటయ్య, పాంగి పులిరాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

దొన్నుదొర పరామర్శ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ కొత్తవలస గ్రామంలో మృతి చెందిన గేమిలి శివరం కుటుంబాన్ని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్ను దొర శుక్రవారం స్వగ్రామంలో పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. శివరం ఆకస్మిక మరణానికి చింతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బొడ్డ శ్యామ్, పి.శంకర్ నాయుడు, నేతలు పాల్గొన్నారు

గీతంలో అట్టహాసంగా 'షోర్ ఫెస్ట్ -23'

ప్రజాశక్తి -మధురవాడ : యువతలో ప్రతిభను వెలికి తీయడానికి, వివిధ ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలను, కళారూపాలను తెలుసుకోవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న 'షోర్ ఫెస్ట్-23' శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్దవటం ప్రారంభించిన వేడుకలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 4 వేల మంది విద్యార్థులు విభిన్న సంప్రదాయ దుస్తులలో పెద్దఎత్తున పాల్గొని సందడి చేశారు. విద్యార్థులు కేరింతల మధ్య గీతం ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. గీతంలోని వివిధ వేదికలపై సాంస్కృతిక, క్రీడా పోటీలను నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఏ విధంగా చేరాలనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. సాంకేతిక అంశాలపై నిపుణుల చర్చాగోష్టిలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో. ప్రో వైస్‌ఛాన్సలర్స్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరక్టర్ రాహుల్‌సింగ్, స్పోర్ట్స్ డైరక్టర్ అరుణా కార్తిక్ పాల్గొన్నారు.



ఫెస్ట్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

స్పందనలో వినతుల వెల్లువ



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పాడేరుటౌన్ : ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 76 ఫిర్యాదులను స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారి సదుపాయాలు, విద్యుత్, భూ, ఉపాధి అవకాశాలు, దుకాణాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలాలు కేటాయింపు కోసం అధికంగా అర్జీదారులు వినతి పత్రాలను అందజేసారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని...

జి.మాడుగుల మండలం గెమ్మిలి పంచాయతీ ఊడపాలెం పాత వీధి నుండి వంజరి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని లవ్వాబు రాంబాబు, ఎల్.సీతారం తదితరులు వినతి పత్రం సమర్పించారు. ముంచంగి పుట్టు మండలం పెదగూడ సర్పంచ్ మండి బాబూరావు బాకుబెడ జంక్షన్ నుండి దొరగూడ గ్రామం వరకు ముట్టి రోడ్డు నిర్మించాలని వినతి పత్రం అందజేసారు. అనంతగిరి మండలం కొండిభ పంచాయతీ లింభగుడ గ్రామానికి చెందిన శిరగం చిన్నయ్య, వృద్ధాప్య పింఛను కోసం, వేంగడ గ్రామస్తుడు మజ్జి జగబంధు సికిల్ సెల్ ఎనీమియా పింఛను కోసం వినతి పత్రాలను సమర్పించారు.పాడేరు మండల కేంద్రం సుంద్రుపుట్టుకు చెందిన మహిళలు వి.విజయలక్ష్మి, కె.రాజేష్ కళ, ఎస్.నాగ మణి తదితరులు తాగునీటి పైపులు మరమ్మతులకు గురై మంచినీటికి ఇబ్బందులు పడుతున్నామని తాగు నీటి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు.హుకుంపేట మండలం తడిగిరి సర్పంచ్ పి.రంజిత్, టి.కృష్ణారావు నేతృత్వంలో మండలానికి చెందిన పలువురు గిరిజనులు హుకుంపేట మండల కేంద్రంలో చిన్న దుకాణాలు, మెకానిక్ షాపులు ఏర్పాటు చేయడానికి స్థలాలు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. ముంచంగిపుట్టు మండలం బంగారు మెట్ట పంచాయతీ బాదిపుట్టు ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.రాంప్రసాద్ పాఠశాలకు విద్యుత్ సదుపాయం కల్పించడానికి విద్యుత్ స్థంబాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.కొయ్యూరు మండల కేంద్రానికి చెందిన మొల్ల పేద మణి తన భూమిని వెబ్ ల్యాండ్లో నమోదు చేసారని, పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయలేదని ఫిర్యాదు చేసారు. హుకుంపేట మండలం గూడ పంచాయతీ లకేపుట్టు గ్రామానికి చెందిన అగతంబడి రాజారావు వైద్య ఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి దరఖాస్తును సమర్పించారు. ఎస్‌డిసి వివిఎస్.శర్మ, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, డిఇఇ పి.రమేష్, టిడబ్ల్యూ ఇఇ డివిఆర్‌ఎం రాజు, డిఎల్ పిఒ పి.ఎస్. కుమార్, పిఆర్ పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, డిఎంఅండ్ హెచ్‌ఒ జమాల్ భాషా, ఎల్‌డిఎం రవి కిరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై పిర్యాదు

హుకుంపేట:మండ కేంద్రంలో బినామీల పేరుతో అక్రమ నిర్మాణాలపై పాడేరులో నిర్వహించిన స్పందనలో సబ్ కలెక్టర్ కు శుక్రవారం ప్రజా సంఘాల నేతలు పిర్యాదు చేశారు. విచ్చలవిడిగా గిరిజనేతరులు నిర్మించిన అక్రమ ఇల్లు, షాపులపై అఖిలపక్షం నాయకులు సబ్ కలెక్టర్ అభిషేక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మకు ఫిర్యాదు చేసిన అనంతరం వారు మాట్లాడుతూ, గిరిజనేతరులు ఒక్కక్కరికే ఐదేసి ఇల్లు, షాపులు కలిగి ఉన్నారన్నారు.హుకుంపేట మండల కేంద్రంలో గిరిజనులు షాపులు పెట్టుకోవడానికి స్థలాలు, బ్యాంక్ రుణాలు ఇవ్వాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని అదికారులు హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నేతలు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, డీఎల్‌ఒ నాయకులు, తడిగిరి సర్పంచ్ పెనుమల రంజీత్ కుమార్, వైసీపీ మండల నాయకులు కిల్లో సాంబన్న, తెలుగుదేశం మండల నాయకులు సోమేలి లక్ష్మయ్య, కోట్నపల్లి ఎంపీటీసీ సాంబే బాలకృష్ణ, జన సేన నాయకులు సీహెచ్ రాజు, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్‌రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు, అధ్యక్షుడు కిల్లో రామారావు పాల్గొన్నారు.

గిరిజనేతరుల భూ ములు సర్వే చేయొద్దు

పాడేరు టౌన్: వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల అక్రమణలో ఉన్న భూములకు సర్వే చేయొద్దని అధివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ అభిషేక్‌ను శుక్రవారం ఐటిడిఎ స్పందన కార్యక్రమంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవిన్యూ సిబ్బంది 5వ షెడ్యూల్ భూభాగంలోని 1/70 చట్టానికి వ్యతిరేకంగా జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే చేస్తున్నారని తెలిపారు. గిరిజనుల ఆధీనంలో ఉన్న భూములకు మాత్రమే రీ సర్వే చేయాలని కోరారు. గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూములకు జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే చేస్తే ఆ భూమిపై వారు హక్కు పొందేందుకు అవకాశం ఇచ్చినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ అరకు, అనంతగిరి కన్వీనర్ లు కె.మల్లమ్మ, ఎస్.సుబ్లాన్, అరకు మండల కార్యదర్శి ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కట్టుబట్టలతో మిగిలిన బాధితులు
ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని కితలంగి పంచాయతీ కరకవలస గ్రామంలోని కోర్ర లంబన్న పూరిల్లు గురువారం సాయంత్రం అకస్మాత్తుగా పూర్తిగా కాలి, దగ్ధమైంది. దీనికి సంబంధించిన వివరాలు.. బాధిత గిరిజనుడు లంబన్న కుటుంబీకులతో కలిసి గురువారం ఆ గ్రామ సమీపంలో కాపీ తోటలో పనుల కోసం వెళ్లారు. ఆ సమయంలో పూరిల్లు ఖాళీ పూర్తిగా దగ్ధమైంది.ఈ ఘటనలో ఇంటి లోపల ఉన్న సామగ్రితో పాటు బియ్యం, పూర్తిగా కాళీ దగ్ధం అయ్యాయి. తక్షణమే ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి:



దగ్ధమైన ఇల్లు

కరకవలస గ్రామంలో ఇల్లు దగ్ధమై నష్టపోయిన బాధిత లంబన్న కుటుంబీకులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని స్థానిక గిరిజన సంఘం మండల నాయకుడు జి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

బాల్య వివాహం అడ్డగింత



మాట్లాడుతున్న సిడిపిఒ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:- మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కెందుగూడలో బాల్య వివాహం జరుగుతున్న విషయం తెలుసుకున్న ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి సిబ్బందితో కలిసి వెళ్లి అడ్డగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామానికి చెందిన కిల్లో బిస్సు, సుత్తిగూడ గ్రామానికి చెందిన వంతల రోహిళలకు ఇరు కుటుంబ సభ్యులు బాల్య వివాహం జరుపుతున్నట్లు తెలుసుకొని గ్రామానికి వెళ్లి నిలుపుదల చేశామన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆమె అన్నారు.బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై కుటుంబీకులకు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సత్యనారాయణమ్మ, అంగన్వాడీ కార్యకర్త దేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు



బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని ప్రభుత్వ స్థలాల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తహసిల్దార్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఆర్వో, సర్వేయర్ కలిసి బ్యాంకు నుంచి బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వరకు ఉన్న ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అసిస్టెంట్ బ్యుటీషియన్ థెరపిస్టు కోర్సుకు 3 నెలలు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుకు 3 నెలలు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డిఎస్‌డిఒ రోహిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు రంపచోడవం డిగ్రీ కళాశాలలో ఉచితంగా శిక్షణ అందించి సర్టిఫికేట్ జారీ చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలకు ఫోన్: 8301534435, 630463247 నెంబర్లకు సంప్రదిం చాలని పేర్కొన్నారు.

పశు వైద్య అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-పెదబయలు:స్థానిక పశువైద్య కార్యాలయంలో ఎమ్మెల్యే సెట్టి ఫాల్గుణ శుక్రవారం వైఎస్ఆర్ సంచార పశు అంబులెన్స్ ను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 1962 నంబర్కు ఫోన్ చేస్తే రైతుల ఇంటికే వైద్య సిబ్బంది వచ్చి సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ, పశు వైద్యాధికారి భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - సీలేరు : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని డిసిసి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం సీలేరు కమ్యూనిటీ హాల్లో సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మరేవులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అంటూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పాలక పార్టీలు ప్రజలను దగా, వంచినా చేస్తున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు ఏళ్లగా చీకటి పాలన జరుగుతుందని, చరిత్రలో ఇంతటి నియంతృత్వం, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ఎవరు చూసి ఉండరని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలమంతా ఐకమత్యంగా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, ఎం.సత్తిబాబు, వి .అప్పారావు, మాజీ సర్పంచ్ అలంక రాజు, మల్లు దొర తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ యాప్‌లతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఫేక్ యాప్, ఆన్లైన్ అప్పు ప్రాణానికే ముప్పని జడ్డంగి ఎస్ఐ ఎస్కే షరీఫ్ అన్నారు. గురువారం మండలంలోని లోదొడ్డి గ్రామంలో ఎస్సై షరీఫ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ యాప్‌ల ద్వారా లోన్లు తీసుకోవడం వలన వారి వేధింపులు తాళలేక అనేకమంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. వీటి పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. గ్రామస్తులు కోడిపందాలు, జూదం, నాటుసారా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రసాద్ రెడ్డి, లోవ, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

మన్యంకొండ జాతరపై సమీక్ష

ప్రజాశక్తి- మోతిగూడెం : ఆంధ్ర-ఒడిషా రాష్ట్రాల గిరిజనుల ముఖ్య పండుగ ముత్యాలమ్మ తల్లి (బడాయాత్ర) జాతర ఈ నెల 27న జరగనున్న సందర్భంగా ఇరు రాష్ట్రాల అధికారులు, జాతర కమిటీ సభ్యులు శుక్రవారం ఒడిషాలోని మల్కనగిరిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్కనగిరి సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్, ఎమ్మెల్యే అజిత్ కుమార్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ జాతర జరిగే పొల్లూరు జలపాతం వద్ద ఏర్పాట్లు, సీలేరు నది వద్ద అమ్మవారు పడవ దాటే ప్రదేశంలో శుభ్రత, శానిటైజేషన్ తదితర ఏర్పాట్లు, భక్తులకు భోజన సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. తదుపరి సమావేశం ఆంధ్రాలో నిర్వహించి ఏర్పాట్లుపై కార్యచరణ తెలియజేస్తామని జాతర కమిటీ తెలిపింది. ఈ సమావేశంలో చింతూరు ఎండిఒ రవిబాబు, మోతుగూడెం ఎపి జెన్కో సివిల్ ఎడిఇ కొండలరావు, మోతుగూడెం ఎఎస్ఐ రాజేశ్వరరావు, జాతర కమిటీ సభ్యులు మల్లికార్జున, వరప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మారేడుమిల్లి : విద్యుత్ షాక్ తగలడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మారేడుమిల్లి మండలం పాములేరు పంచాయితీ పరిధిలోని కుట్రవాడ గ్రామానికి చెందిన పల్లాల వెంకట రమణరెడ్డి అనే వ్యక్తి తన ఇంటికి కరెంట్ సప్లయి రాకపోవడంతో దానిని సరి చేద్దామని సమీపంలోని కరెంట్ స్తంభం ఎక్కాడు. దీంతో అతనికి షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు అంబులెన్స్‌లో మారేడుమిల్లి పీహెచ్సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కల్లేరు నుంచి గూడూరు వరకూ..

బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని కల్లేరు నుండి గూడూరు వరకు ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధుగురు గ్రామంలో సిపిఎం నాయకులు పర్యటించారు. తమ గ్రామానికి చెందిన ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, నిత్యం ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఈ సందర్భంగా గ్రామస్తులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, ట్యాంకు నిర్మాణం చేపట్టి పైపు లైన్‌ల ద్వారా నీరు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సీసం సురేష్ మాట్లాడుతూ కల్లేరు గ్రామపంచాయతీ సూరన్న గొంది రోడ్డును మరమ్మతుల పేరుతో మధుగూరు, గూడూరు వరకు సుమారు 13 కిలోమీటర్ల రోడ్డుపై మెటల్‌ను వేసి నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. దీంతో ఈ రోడ్డు తీవ్ర సౌకర్యంగా ఉందని, మధుగురు వద్ద గూడూరు వద్ద వాగులపైన వంతెనలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు నిత్యం మండల కేంద్రానికి రావడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మధుగురు గ్రామంలో 100 కుటుంబాలు నివసిస్తున్నాయని, చేతి పంపులు పక్కన ప్రవహిస్తున్న వారంతా సీలేరు నదిపై ఆధారపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. మంచినీటి ట్యాంకు, మోటర్ మంజూరు చేసి ప్రతి ఇంటికి నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముర్రం రంగమ్మ, కారం సుబ్బారావు, పాండురం సుబ్బారావు, ఒగ్గల సీతారామయ్య, గ్రామస్తులు జోడే జోగారావు, పాండురం గంగరాజు, తమ్మయ్య, పండ రాంబాబు, పాండు దేశమ్మ, పాండురం కాంతమ్మ, పులి జానకమ్మ. పాండు సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో సిపిఎం నాయకులు

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి ఉమ్మడివరం గ్రామంలో జోగారావు ఇంటి దగ్గర నుండి 50 మీటర్లు పైపులైన్ ఏర్పాటు పనులను స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి తాగునీరు సమస్య ఉండకూడదని ఉద్దేశంతో ఈ పైపులైన్లు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిక్కాల రామారావు, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరను కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, ధాన్యం సేకరణ కూడా పకడ్బందీగా చేపడుతోందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం జివిఎంసి సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు క్షేమం కోసం పండించిన పంటకు మంచి ధర కల్పించడంతో పాటు దళారీ వ్యవస్థ లేకుండా చేశామన్నారు. రైతులు ఆన్‌లైన్ విధానం ద్వారా నగదు కోరుకుంటున్నారని, గతంలో రూ.1200 ఉన్న మద్దతు ధర ప్రస్తుతం రూ.1530గా ఉందని తెలిపారు. అది నేరుగా రైతుల ఖాతాలో జమవుతోందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడడంతో పాటు తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు లేనందువల్ల ప్రత్యేకించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో నాణ్యతతో కూడిన అధిక పంట దిగుబడి వచ్చిందన్నారు. రాగులు, జొన్నలను కూడా రాష్ట్రంలో ప్రజలు కోరుకుంటున్నారని, అందుకోసం రైతులను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రైతులు పండించిన రాగులు, జొన్నలను కూడా రైతుల నుంచి పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేసి పంపిణీకి చర్యలు చేపడుతుందన్నారు. 16 మున్సిపాలిటీలలో పైలెట్ ప్రాజెక్టుగా గోదుమ పిండి పంపిణీ చేయడాన్ని ప్రారంభించామన్నారు. వినియోగదారులు నష్టపోకూడదనే ఆలోచనతో పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, గోల్డు షాపులతో పాటు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 555 కేసులను చేశామన్నారు. అంతకు ముందు మంత్రి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, డిఎస్‌ఒలు, డిఎంలు, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సిఐ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, పౌర సరఫరాల డైరెక్టర్ విజయ సునీత, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండ్యన్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ కె.కల్పనా కుమారి, విజయనగం జాయింట్ కలెక్టర్ కె.మయూరి అశోక్, పార్వతీపురం మన్యం జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం : అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రం రేకపల్లిలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పిఒ రమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 4న చింతూరు ఐటిడిఏ వద్ద జరుగు ఆందోళనకు నాలుగు మండలాల అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రంగమ్మ, మండల అధ్యక్షులు రాజేశ్వరి, కార్యదర్శులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం, సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి చెప్పారని స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో రోనంకి గోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ చూపి సీలేరు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం మంజూరయ్యే విధంగా కృషి చేశారని తెలిపారు. సీలేరు ఇంటర్ మంజూరు కావడంతో విద్యార్థుల సమస్య తొలిగిపోయిందని సంతోషాన్ని వ్యక్త పరిచారు.



చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న అశా, అంగన్‌వాడీ వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతో మేలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ చుట్టు పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఆశ, అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎం, పీహెచ్సీ సిబ్బంది కలిసి స్థానిక సంత మార్కెట్ వీధిలో పెరుగుపోయిన చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. పేరుకుపోయిన మురికి నీటిలో ఫినాయిల్ వేశారు. ఈ సందర్భంగా స్థానికులకు పరికరాల శుభ్రతపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌డీఎస్ కుమారి, హెచ్వీసీహెచ్ సత్యవతి, ఏఎన్ఎం ఎస్ రత్న కుమారి, ఆశ వర్కర్లు రాజేశ్వరి, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్‌కు రూ.2857.85 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ గ్రాంట్‌పై ఢిల్లీ నుంచి రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం విశాఖపట్నంలోని డిఆర్ఎం సమావేశ మందిరంలో డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను వెల్లడించారు. వాల్తేరు డివిజన్‌కు వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2800 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.